క్లుప్తంగా

5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్


మాట్లాడుతున్న ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షల నిర్వాహణకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో ప్రయోగ పరీక్షలపై సీఎస్‌లు, డీవోలతో సమీక్షించారు. ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఫిబ్రవరి 5 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న పరీక్షలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. 5వ తేదీన ఒకేషనల్ విద్యార్థులకు, 11వ తేదీన జనరల్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 138 కేంద్రాల్లో 22,454 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు తెలిపా రు. ప్రతి స్పెల్ ఐదు రోజులపాటు ఉంటుందని, విధులు కేటాయించిన ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. ఫిబ్రవరి 2వ తేదీన నైతికత, మానవీయ విలువల పరీక్ష, 3వ తేదీన పర్యావరణ విద్య పరీక్షాలు ఉంటాయన్నారు. ఈ సమీక్షలో ప్రత్యేకాధికారి విశ్వనాథనాయక్, డీఈసీ సభ్యులు రఘుపతి, డాక్టర్ గోపాల్ రెడ్డి, తులసీరామిరెడ్డి, ఒకేషనల్ డీఈసీ బాబు పాల్గొన్నారు.

స్టాండర్డ్స్..లేబులింగ్‌తో శక్తి ఆదా

ఏర్పేడు : స్టాండర్డ్స్, లేబులింగ్ ద్వారా శక్తిని ఆదా చేయవచ్చని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం), సిరి ఎక్సర్జీ సహకారంతో ప్రమాణాలు, లేబులింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు. డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ శక్తి ఆదా ప్రాముఖ్యత, ఎలక్ట్రికల్ ఉపకరణాల ప్రమాణాలు, లేబులింగ్‌పై అవగాహన, జ్ఞానాన్ని అందించడం లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. వివిధ రంగాల్లో ఇంధనం-సమర్థవంతమైన పద్ధతులు, సాంకేతికత అవలంబించాల్సి అవసరాలను తెలిపారు. కార్యక్రమానికి సుమారు 220 మంది విద్యార్థులతోపాటు ఏపీఎస్ఈసీ నిపుణులు మధు,దామోదర్,సుబ్రమణ్యంహాజరయ్యారు.

ఆదిమూలం వ్యాఖ్యలపై ఆగ్రహం


పిచ్చాటూరు : విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు


వరదయ్యపాళెంలో దిష్టి బొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పిచ్చాటూరు : ఎమ్మెల్యే ఆదిమూలం అనవసర రాద్ధాంతం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పిచ్చాటూరులో వారు విలేకర్లతో మాట్లాడారు. సింగిల్‌విండో చైర్మన్ కేటీ హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ రెండు పర్యాయాలు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఆదిమూలం అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఇసుక, గ్రావెల్ తవ్వుకుపోయారని ఆరోపించడం దిగజారుడు మాటలని విమర్శించారు. గత పదేళ్లుగా పలుమార్లు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో మంత్రి పెద్దిరెడ్డి ఇంటి వద్ద సమావేశాలు నిర్వహించిన విషయం మర్చిపోవడం సరికాదన్నారు. తిరుపతిలో జరిగిన ఆత్మీయ సభకు ప్రస్తుత సత్యవేడు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఆహ్వానించేందుకు ఆదిమూలం ఇంటికి వెళితే ముఖం చాటేయడమే కాకుండా కార్యకర్తలు డబ్బుల కోసం వెళ్లారని వ్యాఖ్యానించడం అన్యాయమని మండిపడ్డారు. ఎమ్మెల్యే ఆదిమూలం ఆరోపించినట్టు నియోజకవర్గంలో అధికారుల బదిలీలపై మంత్రి పెద్దిరెడ్డి ఏనాడూ జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన సమన్వయకర్త గురుమూర్తికి పూర్తిస్థాయిలో అండగా ఉంటామని తెలిపారు. ఆదిమూలానికి దమ్ముంటే టీడీపీ టికెట్ తెచ్చుకుని పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. చంద్రబాబు ట్రాప్‌లో పడి నోటికొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ సహించే ప్రసక్తే లేదన్నారు.

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

నారా లోకేష్‌తో ఎమ్మెల్యే ఆదిమూలం, ఆయన కుమారుడు సుమన్ భేటీ అయిన ఫొటోలను మంగళవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండిపడ్డాయి. దళిత ద్రోహి ఆదిమూలం అంటూ జాతీయ రహదారిపై ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ ఆదిమూలం గెలుపుకోసం అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలను డబ్బు కోసం సమావేశానికి వెళ్లారని అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యాన రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారని, మూడోసారి ఎంపీగా అవకాశం కల్పించాలని చూస్తే పార్టీపై బురదజల్లేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ అపరంజి రాజు, టౌన్ సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తొప్పయ్య, వైఎస్సార్‌టీయూసీ మండల అధ్యక్షుడు మునిరాజా, ఎంపీటీసీ సభ్యులు వేలు, రమేష్ రాజు, సింగిల్ విండో డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాలపద్మనాభం, స్థానిక నేతలు కిరణ్‌కుమార్ నాయుడు, పాండియన్, చంద్రశేఖర్ రెడ్డి, శేషన్, గజేంద్ర, రాజా, శేఖర్ రెడ్డి, ఆర్ఎస్ రాజు, మోహన్, రాజగోపాల్ రెడ్డి, సతీష్, శోభన్ పాల్గొన్నారు.

ఆరోపణలు సహించం

బుచ్చినాయుడుకండ్రిగ : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించమని, తగిన బుద్ధి చెబుతామని వైఎస్సార్‌సీపీ నేతలు హెచ్చరించారు. మంగళవారం బీఎన్ కండ్రిగలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే టికెట్ రాలేదని నోటికొచ్చినట్టు మాట్లాడితే సహించే ప్రసక్తే లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిమూలం దిష్టబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మణినాయుడు, నేతలు జొన్నలగోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, గురవయ్య, గురునాథం, సాయినాయుడు, ప్రసాద్‌పాల్, అమరలింగయ్య, ప్రసాద్, సాంబయ్య పాల్గొన్నారు.

అనుచితంగా మాట్లాడితే సహించం

నాగలాపురం : వైఎస్సార్‌సీపీ టికెట్ ఇప్పించి.. ఎమ్మెల్యేగా గెలిపించిన మంత్రి పెద్దిరెడ్డిపై ఆదిమూలం అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని పార్టీ నేతలు మండిపడ్డారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పార్టీ నేతలు సమావేశం నిర్వహించారు. అపరంజిరాజు మాట్లాడుతూ ఆదిమూలం విశ్వాసం లేకుండా టీడీపీకి అమ్ముడుపోయారని ఆరోపించారు. దళితులకు జిల్లాలో పెద్ద దిక్కుగా ఉన్న మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి ఆదిమూలానికి లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని మొత్తం క్యాడర్ అంతా జగనన్న ఎంపిక చేసిన గురుమూర్తి వెంటే నడుస్తుందని స్పష్టం చేశారు.

భగ్గుమన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వరదయ్యపాళెం : ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు అవకాశం కల్పించిన వైఎస్సార్‌సీపీని విమర్శిస్తే ఆదిమూలానికి పుట్టగతులు ఉండవని పార్టీ మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏళ్ల తరబడి వెంట తిరిగిన కార్యకర్తలకు కనీస సమాచాం ఇవ్వకుండా టీడీపీ కుమ్మక్కు కావడం విశ్వాసఘాతుకమని విమర్శించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో ఎమ్మెల్యే ఆదిమూలం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, కవిత, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, మండల ప్రచార కార్యదర్శి చిలమత్తూరు భాస్కర్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, బీసీ సెల్ కన్వీనర్ వీరభద్రం, కో-ఆప్షన్ సభ్యుడు సిద్ధిక్ పాల్గొన్నారు.


పిచ్చాటూరులో జాతీయ రహదారిపై ఆదిమూలం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్యకర్తలు


నాగలాపురం : సమావేశంలో మాట్లాడుతున్న అపరంజిరాజు


వరదయ్యపాళెం : మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

వివాదమైన సినిమా షూటింగ్

తిరుపతి క్రైమ్: ఆధ్యాత్మిక నగరంలో తాజాగా ధనుష్, శేఖర్ కమ్ముల కాంబినేషన్లో సినిమా తెరకెక్కుతోంది. ఇదే సినిమాలో అక్కినేని నాగార్జున ప్రత్యేక పాత్రలో పోషించారని చెప్తున్నారు. ఇటీవలే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. అయితే ఈ సినిమా రెండు రోజుల షెడ్యూల్ తిరుపతిలో జరిపే విధంగా చిత్ర బృందం ముందస్తు అనుమతులు తీసుకుంది. మంగళవారం ఉదయం అలిపిరిలో షూటింగ్ చేపట్టగా..భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్ సమస్యని క్లియర్ చేశారు. అయితే మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు శ్రీ గోవిందరాజ స్వామి ఆలయం వద్ద షూటింగ్ నిర్వహించారు. అదే క్రమంలో ఓ మీడియా ప్రతినిధిపై చిత్ర బృంద్రం దాడికి యత్నించింది. దీంతో మీడియా ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కెమెరామన్ పురుషోత్తం తమకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించారు. ట్రాఫిక్, భక్తుల సమస్య నేపథ్యంలో చిత్ర బృందం షూటింగ్‌కు ఇచ్చిన అనుమతులు పోలీస్‌శాఖ రద్దు చేసినట్టు సమాచారం.

అక్రమ కేసుల కొట్టివేత

రేణిగుంట : గత టీడీపీ ప్రభుత్వం అక్రమంగా వైఎస్సార్‌సీపీ నేతలపై పెట్టిన కేసులను మంగళవారం తిరుపతి కోర్టు కొట్టివేసింది. వివరాలు.. గాజులమండ్యం పారిశ్రామికవాడ సమీపంలో ఆరేళ్ల కిందట ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వ్యతిరేకించిన గ్రామస్తులకు వైఎస్సార్‌సీపీ నేతలు అండగా నిలిచారు. ప్రజాపక్షాన పోరాడి డంపింగ్ యార్డును అడ్డుకున్నారు. దీంతో కక్ష పెంచుకున్న టీడీపీ నేతలు అక్రమంగా 11 మంది నేతపై కేసులు నమోదు చేయించారు. ఈ క్రమంలో కేసులో నిందితులుగా టీడీపీ నేతలు ఇరికించిన ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, ఎంపీటీసీ సభ్యులు జువ్వల ధనంజయరెడ్డి, బుడమల వెంకటరమణారెడ్డి, జువ్వల దయాకర్‌రెడ్డి, అవిలాల హరిరెడ్డి, సిద్దాగుంట సుధాకర్‌రెడ్డి, హరినాథ్‌యాదవ్, రవి, బెనర్జీ సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజా సేవకే పునరంకితం



సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి , వల్లివేడులో పార్టీ జెండా ఎగురవేస్తున్న మోహిత్‌రెడ్డి

పాకాల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రజా సేవకే పునరంకితం కావాలని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని దామలచెరువు, పదిపుట్లబైలు, పేరసానిపల్లె, వల్లివేడు, రమణయ్యగారిపల్లె పంచాయతీల్లో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా సచివాలయాల్లో సంక్షేమ బోర్డులు ఆవిష్కరించారు. పార్టీ జెండాలను ఎగురవేశారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మైనారిటీలకు వరమిచ్చారని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రజలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందించిన సేవలు అభినందనీయమన్నారు. కరోనాకు భయపడి అందరూ ఇంటికే పరిమితమైన రోజుల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి మన ప్రజలకు అండగా నిలవాలని సొంత నిధులు వెచ్చించారని వెల్లడించారు. అలాగే సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక పేరుతో ప్రతి కుటుంబానికీ బిడ్డగా మారిపోయారని వివరించారు. ఆయన బాటలోనే నడుస్తూ తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేస్తానని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తనని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ జయదేవ్‌నాయుడు, ఎంపీపీ లోకనాథం, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లివేడు విక్రమ్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటనారాయణరెడ్డి, స్టేట్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రఘుపతి, వైస్ ఎంపీపీ నాగూర్‌బీ, సర్పంచులు సునీత, నాని, బుజ్జమ్మ, శాంతి, నాగరాజా, ఎంపీటీసీ సభ్యులు గౌతమి, మధు, విజయ్‌సారథిరెడ్డి, చొక్కారెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, ఖాజామస్తాన్, రహీం, ఇమ్రాన్, జ్యోతిప్రసాద్‌రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, హసీనా, రఘునాథరెడ్డి, అల్తాఫ్, రాజారామ్‌నాయడు, మధార్‌బాయ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో కమిటీల నియామకం

తిరుపతి అర్బన్: జిల్లాస్థాయిలో వివిధ కమిటీలను ఏర్పాటు చేస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మొత్తం 17 కమిటీలకు గాను 436 మందికి వివిధ హోదాల్లో పదవులు కేటాయించారు. అందులో భాగంగా జిల్లా పంచాయతీ రాజ్ విభాగ కమిటీ ప్రెసిడెంట్‌గా సీహెచ్ చెన్నకేశవరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా సి.జనార్ధన్‌రాజు, ఎస్.సెంథిల్ కుమార్, కె.వెంకటసుబ్బరాజు, డి.గోవర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. రైతు విభాగం కమిటీ అధ్యక్షుడిగా ఎస్.దయాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా సి.గురవారెడ్డి, ఎస్.రామకృష్ణారెడ్డి, కె.మురళీ నాయుడు, పి.చంద్రశేఖర్ నాయుడు, జి.రాజేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డిని నియమించారు. జిల్లా ఎస్సీ విభాగ కమిటీ అధ్యక్షుడిగా ఎస్.బాబు, జనరల్ సెక్రటరీలుగా పి.రమణయ్య, కె.వాణి, ఆర్.జస్టిన్ ఏ రాజు, ఎం.రఘురాం, ఎం.సురేష్, వై.మణి, వాసు నియమితులయ్యారు. జిల్లా ఎస్టీ విభాగ కమిటీ అధ్యక్షుడిగా డి.సుబ్రమణ్యం, జనరల్ సెక్రటరీలుగా ఎం.వెంకటాచలం, ఆర్.శ్రీనివాసులు, వై.ధనంజయులు, జి.వెంకటేశ్వర్లు, టి.చెన్నయ్య, పి.శ్రీనివాసమూర్తి, జిల్లా విద్యార్థి విభాగ కమిటీ ప్రెసిడెంట్‌గా ఓబుల్ రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా డి.యశ్వంత్, జి.సురేష్, ఏ.మణికంఠన్, హెచ్.పృథ్వీచంద్, బి.నిఖిల్ సాయిని నియమించారు. జిల్లా వాణిజ్య విభాగ కమిటీ ప్రెసిడెంట్‌గా పి.గుప్తా, జనరల్ సెక్రటరీలుగా ఎం.పెంచల్ రెడ్డి, యూ.గురుమూర్తిరెడ్డి, వి.ఎబింజర్ బాబు, ఎస్ఆర్‌బీ హరి, ఎస్‌కే మోహిన్ బాషా, వి.వేణుగోపాల్ ఉన్నారు. జిల్లా వికలాంగుల విభాగ కమిటీ ప్రెసిడెంట్‌గా సి.మోహన్, జనరల్ సెక్రటరీలుగా టి.మురళి, షేక్‌గాఫర్, ఎన్.గురవయ్య, ఖాదర్‌వలీ నియమితులయ్యారు. జిల్లా చేనేత విభాగ కమిటీ అధ్యక్షుడిగా కె.శివకుమార్, జనరల్ సెక్రటరీలుగా సి.జగదీశ్వరయ్య, సి.హరిబాబు, పృథ్వీ రవి, డి.భార్గవ్‌రామ్ ఉన్నారు. జిల్లా యువజన విభాగ కమిటీ అధ్యక్షుడిగా ఏ.అజయ్‌కుమార్, జనరల్ సెక్రటరీలు కె.గురవయ్య, పి.కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏడీఆర్ సాయి, బి.శ్రీధర్‌రెడ్డి, కె.భగవాన్ అనుదీప్, సి.సాయిరెడ్డి, పి.కిరణ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. జిల్లా సేవాదళ్ విభాగ కమిటీ అధ్యక్షుడిగా కె.ఢిల్లీబాబు, జనరల్ సెక్రటరీలుగా ఏ.సురేష్ కుమార్, ఎన్.రామ్‌గోపాల్‌రెడ్డి, వి.మురళీమోహన్‌రెడ్డి, పి.బాబుయాదవ్, ఆర్.ప్రసాద్‌నాయుడు, డి.సుధాకర్‌రెడ్డి ఉన్నారు. జిల్లా వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ విభాగ కమిటీ అధ్యక్షుడిగా ఏ.ఉపేంద్రరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా కె.రమేష్, యూ.మునుస్వామి రెడ్డి, సి.బాబురెడ్డి ఎంపికయ్యారు. జిల్లా బీసీ విభాగ కమిటీ అధ్యక్షుడిగా పి.శివప్రసాద్ యాదవ్, జనరల్ సెక్రటరీలుగా జి.గోపీయాదవ్, ఏ.శంకర్, కె.వినోద్, సి.రమేష్ యాదవ్, సి.యుగంధర్, ఎం.మధుసూదన్ యాదవ్, పి.నరేష్ ఉన్నారు. జిల్లా క్రిస్టియన్ మైనారిటీ విభాగ కమిటీ అధ్యక్షుడిగా బీవీ పాల్‌రాజ్, జనరల్ సెక్రటరీలుగా బి.అరుణోదయ్‌కుమార్, వి.బాబు, కె.ముకుందా, వి.రాజమణి, జి.శ్రీనివాసులు, కేఎం. వరకళాచంద్ ఎంపికయ్యారు. జిల్లా సాంస్కృతిక విభాగ కమిటీ అధ్యక్షుడిగా కె.శాస్త్రిరాజు, జనరల్ సెక్రటరీలుగా ఓ.గురునాథం, ఏ.రుద్రయ్య, ఏ.మోహన్‌రావ్, బి.దామోదర్‌రెడ్డి ఉన్నారు. జిల్లా ఐటీ విభాగ కమిటీ అధ్యక్షుడిగా ఎం.మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా డి.చాంద్‌బాషా, సుధీర్‌కుమార్, జనరల్ సెక్రటరీలుగా సి.శివారెడ్డి, ఎస్.శేషం, బి.రంగయ్య ఉన్నారు. జిల్లా మహిళా విభాగ కమిటీ అధ్యక్షులుగా బి.మాధవి, జనరల్ సెక్రటరీలుగా జి.లత, ఆర్.దేవికా చౌదరి, బి.గీతా యాదవ్, కె.ధనలక్ష్మి, ఎస్‌కే మస్తానీ, ఎస్.బుద్ధాదేవమ్మ ఎంపికయ్యారు. జిల్లా మైనారిటీ విభాగ కమిటీ అధ్యక్షుడిగా ఎస్.మహ్మద్ రసూల్, జనరల్ సెక్రటరీలుగా పి.పరీద్, ఎస్. యస్‌దానీబాషా, చెన్నాబాషా, సుబుద్దీన్, ఎస్‌డీ ఫయాజ్ నియమితులయ్యారు.

ఉద్యోగ కల్పనే ధ్యేయం


సదస్సు వేదికపై అతిథులు, పలు పరిశ్రమల ప్రతినిధులు


హాజరైన వర్సిటీ విద్యార్థులు

తిరుపతి సిటీ: విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ కల్పనే ధ్యేయంగా వర్సిటీ పనిచేస్తోందని ఎస్వీయూ వీసీ వీ.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ రుసా, ఎస్వీయూ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, ఏపీ టెక్నాలజీ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో మీట్ ది ఇండస్ట్రీ అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వర్సిటీలో కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే పలు పారిశ్రామిక రంగ నిపుణులతో జాతీయ సదస్సును ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు అధునాతన టెక్నాలజీలోని పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే తమ లక్ష్యమన్నారు. తిరుపతిలో 30 ఐటీ, 20 ఎలక్ట్రానిక్ కంపెనీలు ఉన్నాయని, పదివేలకు పైగా ఉద్యోగావకాశాలు పొందే అవకాశం ఉందన్నారు. అనంతరం వర్సిటీలో ఎంబీఏ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు నేరుగా సదస్సుకు హాజరైన పారిశ్రామిక నిపుణులతో ఉద్యోగ అవకాశాలు, స్కిల్ డెవలప్‌మెంట్‌పై సందేహాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇన్నోవేషన్‌లో ప్రతిభ చూపిన పలు స్టార్టప్ కంపెనీలకు అవార్డులు అందజేశారు. రిజిస్ట్రార్ హుస్సేన్, డీన్ విజయ భాస్కర్‌రావు, రుసా సీఈఓ వంశీకృష్ణరాయల, పీ.లక్ష్మీ, మోహన్‌క్రిష్ణ, పాల్గొన్నారు.

పురుషోత్తమనాయుడికి నివాళి



పాకాల: ఆదినపల్లె పంచాయతీకి చెందిన పురుషోత్తమనాయుడు మృతిపై తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ఆదినపల్లెకు చేరుకున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్రెడ్డి ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పురుషోత్తమనాయుడు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సోదరుడి మృతితో బాధ పడుతున్న ఆదినపల్లె పంచాయతీ వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ బాలకృష్ణనాయుడుని మోహిత్రెడ్డి ఓదార్చారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విజేత పాకాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అధికారులు, నాయకులు

చంద్రగిరి: మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడాప్రతిభను ప్రపంచానికి చాటేందుకు చక్కటి వేదికగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిలిచిందని ఎంపీడీఓ బాలాజీ నాయక్ అన్నారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో విజేతలకు మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బహుమతులను ప్రదానం చేశారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

ఒకప్పుడు చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ ఆస్పత్రి దయనీయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతుండేది. అప్పట్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేస్తూ సామాజిక ఆరోగ్య కేంద్రంగా(సీహెచ్‌సీ) మార్చారు. టీడీపీ హయాంలో 50 పడకల ఆస్పత్రిగా రూపు దిద్దుతామని హామీలు గుప్పించారు. అయితే ఆనాటి నుంచే ఆస్పత్రి దుస్థితిలోకి వెళ్లింది. అయితే 24 ఏళ్లుగా ఉన్న ఈ సమస్యకు నాడు-నేడు కింద పరిష్కారం లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఈ ఆస్పత్రి కొత్త రూపు సంతరించుకుంది. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో నిధులు మంజూరు కావడంతో త్వరితగతిన కొత్త భవనాల నిర్మాణం సాధ్యమైందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నాడు-నేడు కింద నిర్మించిన ఆసుపత్రి భవనం

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ ఆస్పత్రిని 1961 జూన్ 30న ప్రారంభించారు. ఆనాటి నుంచి 1999 వరకు చిన్నగొట్టిగల్లు పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించడం, తిరుపతి రుయా ఆస్పత్రికి అనుబంధంగా ఏఎన్ఎంలు, నర్సులు శిక్షణా కేంద్రంగా విరాజిల్లింది. 1999లో ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయడంతో పీహెచ్‌సీ స్థాయిలో పనిచేసే వైద్యులు, సిబ్బంది వెళ్లడం, సకాలంలో వైద్యులు రాక 2004 వరకు వైద్య సేవల కోసం మండల ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దివంగత నేత వైఎస్ఆర్ హయాంలో ఆస్పత్రి స్థాయి తగినట్లు వైద్యులను నియమించారు. ప్రస్తుతం ఆస్పత్రి స్థాయికి తగిన విధంగా వైద్యులు ఉన్నారు. అయితే వారు ఉండడానికి కనీస వసతులు లేక పోవడం, ఆస్పత్రి భవనాలు చిన్నపాటి వర్షానికే ఉరుస్తుండడంతో పేదలు, వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆస్పత్రిని సందర్శించినప్పుడు అక్కడ ఉన్న రోగులను, వైద్యులను ఆస్పత్రి గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో స్వయంగా మాట్లాడి నాడు-నేడు కింద ఆస్పత్రి భవనాలను ఆధునికీకరిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు భవనాలను మంజూరు చేయించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయడానికి చొరవ తీసుకున్నారు. భవన నిర్మాణం పూర్తి కావడంతో 30 పడకలు అందుబాటులోకి వస్తున్నాయి. చిన్నగొట్టిగల్లు వైద్యశాలకు పూర్వ వైభవం రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెరవేరనున్న చిరకాల కోరిక

నాడు-నేడు కింద ఆస్పత్రి భవనం రూ.7.25 కోట్లుతో పూర్తి కానుండడంతో పేదల చిరకాల కోరిక నెరవేరనున్నది. తిరుపతి-బళ్లారి జాతీయ రహదారి మార్గంలో పీలేరు తరువాత తిరుపతి వరకు మార్గమధ్యలో ఆస్పత్రి లేదు. చిన్నగొట్టిగల్లులో ఆస్పత్రి అందుబాటులోకి వస్తే తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలాలకు వైద్యం అందుబాటులోకి వస్తుంది. జాతీయ రహదారి మార్గంలో ప్రమాదాలు జరిగినప్పుడు పెద్దాసుపత్రి అందుబాటులో ఉంటుంది.

ఎమ్మెల్యే చెవిరెడ్డి కృషికి కృతజ్ఞతలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం చేపట్టిన నాడు-నేడు పథకాన్ని ఆస్పత్రి భవన నిర్మాణానికి తీసుకొచ్చిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఈ ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. పేదల ఆరోగ్యానికి ఎమ్మెల్యే ఇచ్చే గౌరవ ప్రదమైన మర్యాదకు ఎప్పుడూ రుణపడిఉంటామని అంటున్నారు.

క్లుప్తంగా

డిస్‌ప్లే బోర్డులు సరఫరా

పాకాల: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి కృషి చేస్తున్న సేవలు కొనియాడుతూ ప్రభుత్వం సరఫరా చేసిన డిస్‌ప్లే బోర్డులను అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ బాబ్జీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన అమ్మఒడి, గోరుముద్ద, విద్యాకానుక, నాడు–నేడు, ట్యాబ్స్ పంపిణీ కార్యక్రమాలతో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అవకాశం ఏర్పడిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 లింగయ్య, హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేడు చిన్నగొట్టిగల్లులో ఆసరా పంపిణీ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులో అక్క చెల్లెమ్మలకు నాలుగో విడత వైఎస్‌ఆర్ ఆసరా పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నగొట్టిగల్లులో నూతనంగా రూ.7.25 కోట్లుతో నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించడం, అనంతరం వైఎస్‌ఆర్ ఆసరా చెక్కులు పంపిణీ చేస్తామన్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, మంత్రులు హాజరు అవుతారన్నారు. సమావేశంలో ఎంపీడీవో దేవేంద్ర బాబు, ఈవోపీఆర్డీ సోమశేఖర్‌రెడ్డి, ఏపీఎం కుమార్ పాల్గొన్నారు. ఎర్రావారిపాళెం మండలంలో కూడా నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం ఉదయం 9 గంటలకు ఉంటుందని ఎంపీపీ రెడ్డెమ్మ తెలిపారు.

వేడుకగా శ్రీత్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం

తిరుపతి కల్చరల్: సంగీత త్రిమూర్తులలో ఒక్కరైన శ్రీత్యాగరాజ స్వామివారి 177వ ఆరాధన మహోత్సవం మంగళవారం ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో అత్యంత వేడుకగా నిర్వహించారు. ఇందులో ముందుగా కళాశాల ఆవరణలోని శ్రీత్యాగరాజ స్వామి విగ్రహానికి పూజలు నిర్వహించి పుష్పాంజలి ఘటించారు. అనంతరం కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులు త్యాగరాజస్వామి సంకీర్తనలను రాగయుక్తంగా ఆలపించి ఆకట్టుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఉమా ముద్దుబాల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి


గడపగడపకు మన ప్రభుత్వంలో యువతతో మమేకమైన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

- గడపగడపకు మన ప్రభుత్వంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి: క్రీడలతోపాటు అన్ని రంగాల్లో యువత రాణించాలని, అందుకు తగ్గట్టుగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం యువతను ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే చెవిరెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని నరసింగాపురం పంచాయతీలో ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్‌రెడ్డితో కలసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు ఆయన తిరుగుతూ నాలుగున్నరేళ్లలో జగనన్న ప్రభుత్వంలో లబ్ధిదారులకు అందిన సంక్షేమ జాబితాను వివరించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ రాజేంద్రప్రసాద్(పెదబాబు), ఎంపీటీసీ అశ్విని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆయనకు పూలవర్షంతో ఘనంగా స్వాగతం పలికారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి అందించిన సంక్షేమ ఫలాలు, కరోనా సమయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన సాయం మరువలేనిదని, రానున్న ఎన్నికల్లో వైఎస్‌ఆర్ సీపీకు పట్టం కడతామంటూ జేజేలు పలికారు.

యువతదే కీలక పాత్ర

నేటి రాజకీయాల్లో యువత కీలక భూమిక పోషిస్తోందని యువ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అన్నారు. నరసింగాపురంలో క్రీడాకారులతో ఆయన కాసేపు వాలీబాల్ ఆడి ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన క్రీడాకారులతో మాట్లాడుతూ.. ఆడుదాం ఆంధ్ర పేరుతో రాష్ట్ర క్రీడా ప్రతిభను దేశానికి చాటిచెప్పేందుకు క్రీడా ఉత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. అతి చిన్న వయసులో తుడా చైర్మన్‌గా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు నడుం బిగించారన్నారు. పదవి పొందిన తర్వాత కార్యాలయానికి పరిమితం కాకుండా నిత్యం ప్రజల్లో పర్యటిస్తూ, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని గుర్తు చేశారు. అభివృద్ధి చేసే తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి లాంటి యువకులకు మద్దతుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. సర్పంచ్ చెంచురత్నం శెట్టి, ఏఎంసీ చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పసల నాగరాజు, భోస్ చంద్రారెడ్డి, నాయకులు మట్టా మధుసూదన్ రెడ్డి, వెంకటముని రెడ్డి, సుబ్రమణ్యం, మస్తాన్, మాధవరెడ్డి, సుభాన్, సూరి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపట్టులో ఆత్మీయ పలకరింపు


బ్రాహ్మణపట్టులో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను కరపత్రాల ద్వారా వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: బ్రాహ్మణపట్టు గ్రామ పంచాయతీ పరిధిలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆ గ్రామ పంచాయతీలో చేసిన ప్రగతి పనుల వివరాలను తెలియపరుస్తూ వచ్చే ఎన్నికల్లో తన బిడ్డ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని అభ్యర్థించారు. తమ గ్రామంలోకి వచ్చిన చెవిరెడ్డి లక్ష్మికి పార్టీలకు అతీతంగా గ్రామస్తులు ఆత్మీయతను పంచుతూ.. హారతులతో స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తొలుత గ్రామ దేవతలకు పూజలు చేసి అంతా మంచి జరగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు


నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి 28వ డివిజన్ ఎల్‌బీసీ రోడ్డు, ఊతుకుంటలో వెలసిన నడివీధి గంగమ్మ జాతరను మంగళవారం కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, ఆలయ ధర్మకర్తలు ఊతుకుంట మోహన్, సుధాకర్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ మేయర్, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ ఆదిలక్ష్మి, పార్టీ నాయకులు చాంద్‌బాషా, కొల్లి రఘురామిరెడ్డి, నాగేశ్వరరావు, అశోక్, వేణు, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

అన్నా ఆరోగ్యం ఎలా ఉంది...


పాముల రమేష్‌రెడ్డిని పరామర్శిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: 'అన్నా ఆరోగ్యం ఎలా ఉంది' అని పార్టీ సీనియర్ నాయకుడు పాముల రమేష్‌రెడ్డిని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పరామర్శించారు. మంగళవారం కట్టకిందపల్లెలోని ఆయన నివాసానికి వెళ్లిన డిప్యూటీ మేయర్, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

గాంధీజీ కలల సాకారం దిశగా జగనన్న పాలన – డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి


మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, డాక్టర్ పీసీ రాయులు

తిరుపతి కల్చరల్: గాంధీజీ కలలుగన్న స్వరాజ్యం, గ్రామ, వార్డు సచివాలయం వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పరిపాలన అందిస్తున్నారని డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ.రాయులు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 76వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం తిమ్మినాయుడు పాలెంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ.రాయులు, ఢిల్లీ గాంధీజీ స్మృతి మాజీ డైరెక్టర్ డాక్టర్ సవిత సింగ్ ఆధ్వర్యంలో వెయ్యి మంది పేద మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. నవజీవన్ బ్లైండ్ రిలీఫ్ సెంటర్‌కి రూ.1,16,000 విరాళంగా అందజేశారు. ట్రస్ట్ డైరెక్టర్ రుద్రరాజు శ్రీదేవి, మాజీ సర్పంచ్ ఆదం సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్ అనిల్‌కుమార్, మంజు అగర్వాల్, గాదె సుబ్రమణ్యంరెడ్డి, ఉమాపతి, బండి మధుసూదన్‌రెడ్డి, స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణలో అగ్రగామి


సమావేశంలో మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ.కుమార్

తిరుపతి కల్చరల్: ఉత్తమ వైద్య సేవలతో క్యాన్సర్ నిర్మూలనకు నిరంతరం కృషి చేస్తూ తిరుపతి జిల్లాను ఆదర్శంగా నిలపాలని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ పిలుపు నిచ్చారు. స్విమ్స్ శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్విమ్స్ ఓపీడీ బ్లాక్ శ్రీపద్మావతి ఆడిటోరియంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ రోగులను తొలి దశలోనే గుర్తించి, ఆసుపత్రులకు తరలించే బాధ్యతలను మిడిల్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ తీసుకోవాలని సూచించారు. శ్రీబయో ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం.జయచంద్రారెడ్డి, తిరుపతి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూష, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, డాక్టర్ శ్రీనివాస డీపీఎంవో డాక్టర్ అరుణ సులోచన, డాక్టర్ తేజస్విని, డీఎస్‌వో డాక్టర్ లావణ్య, కమ్యూనిటీ మెడిసిన్ సిబ్బంది, శ్రీబయో సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన కమిషనర్



తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్గా బాధ్యతలు చేపట్టిన అదితి సింగ్ టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీషను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

కోవిడ్ అమర వైద్యుల సేవలు మరువలేనివి


మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరమణ

తిరుపతి తుడా: కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొని ప్రజల ప్రాణాలను కాపాడే క్రమంలో ఎంతోమంది వైద్యులు బలయ్యారని ఐఎంఏ తిరుపతి శాఖ జనరల్ సెక్రటరీ, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.వెంకటరమణ అన్నారు. ఎస్వీ మెడికల్ కళాశాలలో ఐఎంఏ జాతీయ శాఖ ఆదేశాల మేరకు మంగళవారం కోవిడ్ అమర వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. మన రాష్ట్రంలోనే 124 మంది వైద్యులు కోవిడ్‌తో మృతి చెందడం బాధాకరమన్నారు. ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ జనార్దన్, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ కాంత్, డాక్టర్ హరికృష్ణ, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

ఏ వన్ సర్వీసెస్‌పై చర్యలు తీసుకోండి

తిరుపతి తుడా: రుయా ఆసుపత్రి లో పారిశుధ్య కార్మికుల కడుపు కొడుతున్న ఏ వన్ సర్వీసెస్ కాంట్రాక్టును రద్దు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ నాయకులు మంగళవారం రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు శివారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథం, తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి రవి, అధ్యక్షుడు కేవై రాజా, మహేంద్ర, శివ, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆగని గజరాజుల దాడులు

చంద్రగిరి: అటవీ సమీప గ్రామాల్లోని పంటపొలాలపై గజరాజుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. వారం రోజుల క్రితం యల్లంపల్లి పరిసర ప్రాంతాల్లో పంటలను ధ్వంసం చేసిన ఏనుగులు, సోమవారం అర్ధరాత్రి చిన్నరామాపురం, శేషాపురం ప్రాంతాల్లోని పంటపొలాలపై విరుచుకుపడ్డాయి. రైతులు నాగేశ్వరరావు, షాజహాన్, సంపూర్ణమ్మ, చంద్రకేశవుల నాయుడులకు చెందిన వరి, కొబ్బరి, మామిడి, జొన్న, గడ్డి పంటలపై దాడులకు తెగబడ్డాయి. పంటపొలాలతో పాటు మోటార్లు, పైపులను ధ్వంసం చేశాయి. సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఏనుగుల గుంపును దారి మళ్లించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

చంద్రగిరి: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అన్నారు. ఎంపీడీఓ బాలాజీ నాయక్ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. రాయలపురం సర్పంచ్ వెంకటయ్య మాట్లాడుతూ.. వెంకటంపేటలోని కాలువ మురుగునీరు వెళ్లేందుకు దారి లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ప్రస్తుతం జాతీయ రహదారి ఆనుకుని ఉన్న కాలువ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం భూ సమీకరణకు నోటిఫికేషన్ జారీ చేసిందని, త్వరలోనే పరిష్కారం లభించనుందని తెలిపారు. చిన్నరామాపురం, యల్లంపల్లిల్లో అటవీ ఏనుగుల దాడులు అధికమయ్యాయని చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ భోస్ చంద్రారెడ్డి కోరారు. మల్లం చంద్రమౌళిరెడ్డి, ఈఓపీఆర్డీ శశిరేఖ పాల్గొన్నారు.

మద్యం మత్తులో షికారీపై కత్తితో దాడి

తిరుమల: మద్యం మత్తులో ఇద్దరు షికారీలు గొడవపడి కత్తితో దాడిచేసిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాలాజీ బస్టాండ్ సమీపంలో రాజేష్, గాంధీ అనే ఇద్దరు షికారీలు మద్యం మత్తులో గొడవపడ్డారు. గాంధీ రాజేష్‌పై కత్తితో దాడిచేయడంతో వీపుపై తీవ్ర గాయలయ్యాయని బాధితుడు వాపోయాడు. వెంటనే స్థానికులు అతడిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. తిరుమల పోలీసులు విచారణ చేపట్టారు.